నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | NIRMAL

అందరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి..

యాగశాలలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఫిబ్రవరి 26 : సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుని, మానసికంగా, ప్రశాంతంగా జీవనాన్ని గడపాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. సోమవారం లక్ష్మీపూర్‌లో నూతనం గా నిర్మించిన శ్రీరామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముని కృపా కటాక్షాలతో ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఎంపీపీ గోవర్ధన్, మాజీ సర్పంచ్ లక్ష్మి, గ్రామ పెద్దలు అడప తిరుపతి, వీడీసీ చైర్మన్ దాసరి నారాయణ పాల్గొన్నారు.

బాసరలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

తన మనవడు విరాట్‌కు అక్షరాభ్యాసం చేయిస్తున్న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ

బాసర, ఫిబ్రవరి 26 : సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ సోమవారం కుటుంబ సమేతంగా సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తన మనవడు విరాట్‌కి అక్షరాభ్యాసం చేయించారు. వీరికి ఆలయ అర్చకులు అశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

కలెక్టర్ తీరుపై ఆగ్రహం

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, ఆయాలకు పదోన్నతులు కల్పించాలని కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తే సస్పెండ్ చేస్తామని బెదిరించారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ ఆరోపించారు. సోమవారం సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వంద మంది అంగన్‌వాడీ ఉద్యోగులు వేతనాలు చెల్లించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్లారు. మీరందరూ పని వేళల్లో ఎందుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మీ అందరినీ సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కలెక్టర్ తీరును నిరసిస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోశెట్టి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజమణి, లలిత, శైలజ, వెంకటలక్ష్మి, భాగ్య, పర్ణన, దేవిక, లావణ్య, శ్రావణి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పాత పద్ధతిలోనే ప్రమోషన్స్ కల్పించాలి..

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : అంగన్‌వాడీ హెల్పర్స్‌కు పాత పద్ధతిలోనే ఎస్ఎస్‌సీ అర్హత ప్రకారం ప్రమోషన్స్ కల్పించాలని, పదోన్నతి వయసు 50 ఏండ్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సునీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రమోషన్ సౌకర్యం, విద్యార్హత ఎస్ఎస్‌సీ ఉన్న దానిని ఇంటర్‌కు మార్చారన్నారు. ఫలితంగా పదోన్నతులకు హెల్పర్లు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పాత పద్ధతిలోనే ప్రమోషన్స్ కల్పించాలని, వయస్సు 50 ఏండ్లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, డి.సునీత అంగన్‌వాడీ హెల్పర్స్ లక్ష్మీ ప్రియాంక, గంగమ్మ, యోగిత, విజయలక్ష్మి, అనిత, ప్రియాంక పాల్గొన్నారు.

నోరు మూసుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

కేంద్ర సర్కారు తీరుపై నిరసన

- మద్దతు ధర అడిగితే రైతులపై కాల్పులు జరిపారు..
- రైతు ప్రాణాలు తీసుకున్న పాపం బీజేపీ నాయకులదే..
- భైంసా మార్కెట్ యార్డులో మూతి మూసుకుని ఆందోళన

భైంసా, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లా భైంసా మార్కెట్ యార్డులో తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నోరు మూసుకుని రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంటులో కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకురావాలని రైతులు పోరాటాలు చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ సర్కారు రైతులపై కాల్పులు జరపడంతో ఒక రైతు మృతిచెందాడని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావాలని కోరారు. చనిపోయిన రైతు కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్ప లక్ష్మణ్, సాయికిరణ్, సాజిద్ బేగ్, తిరుపతి ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి..

ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు

నేరడిగొండ, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ జిల్లాలో ఎస్టీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని గిరిజన విద్యార్థుల సంఘం ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి సలాం వరుణ్, మండల అధ్యక్షుడు రాథోడ్ సందీప్ కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని, లేదంటే ఆదివాసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. విద్యార్థులు గోపాల్, నరేశ్, సునీల్, కేశవ్, హరీశ్, శంకర్ పాల్గొన్నారు.

పాతాళంలో గంగ

7.5 మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

- సాగుపై ప్రభావం.. స్ప్రింక్లర్ల సాయంతో నీటి సరఫరా..
- నీటిని వృథా చేయకుండా సరఫరా చేయాలంటున్న అధికారులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భ జల నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. గతేడాదితో పోలిస్తే నీటిమట్టం చాలా లోతుకు చేరింది. యాసంగిలో 1.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా.. నీటిమట్టం పాతాళానికి చేరడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ వానకాలంలో కురిసిన వర్షాలతో సాగు నీటి వనరుల్లోకి నీరు బాగా చేరింది. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలు, తర్వాత సరిగా పడకపోవడంతో పత్తి, ఇతర పంటలపై ప్రభావం పడింది. పది రోజులుగా ఎండల ప్రభావం అధికంగా ఉంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఎండల కారణంగా నీటిమట్టం తగ్గుముఖం పడుతున్నది. జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో శనగ 67 వేల ఎకరాలు, జొన్న 62 వేలు, మక్క 11 వేలు, గోధుమ 4,600 ఎకరాలు సాగయ్యాయి. చాలా మంది రైతులు యాసంగిలో బోరు, వ్యవసాయ బావుల ద్వారా కరెంటు మోటర్ల సాయంతో నీరు అందిస్తారు. జొన్న, మక్క, గోధుమ, వేరుశనగ పంటలకు నీరు అవసరమవుతున్నది. ప్రస్తుతం స్ప్రింక్లర్ల సాయంతో నీటిని సరఫరా చేస్తారు.

గతేడాది పోలిస్తే లోతుకు..

భూగర్భజలాలు గతేడాదితో పోలిస్తే అధిక లోతుకు పడిపోయాయి. జనవరిలో 6.9 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజల నీటిమట్టం 7.5 మీటర్లకు పడిపోయింది. నెల రోజుల్లో దాదాపు 1.5 మీటర్లకు పడిపోగా.. ఏప్రిల్, మే నెలల్లో 9 నుంచి 10 మీటర్లకు పడిపోయే ప్రమాదం ఉంది. ఇచ్చోడ, గుడిహత్నూర్, జైనథ్, బోథ్, నార్నూర్, గాదిగూడ, జైనథ్, ఇంద్రవెల్లి మండలాల్లో భూగర్భజలాలు బాగా తగ్గాయి. ఆదిలాబాద్ రూరల్, తాంసి, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో కూరగాయల సాగు అధికంగా ఉంటుంది. అడుగంటుతున్న భూగర్భజలాల ప్రభావం కూరగాయల సాగుపై పడనుంది. చాలా ప్రాంతాల్లో బోరు ఏకధాటిగా పోయకుండా మధ్యలో ఆగుతూ పోస్తున్నాయని రైతులు అంటున్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

భూమిపూజ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్
- బుగ్గారం-బిలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

నేరడిగొండ, ఫిబ్రవరి 26 : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం బుగ్గారం-బి గ్రామంలోని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని అన్నారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు జాదవ్ వసంత్‌రావ్, పాండు, సురేందర్, ప్రతాప్‌సింగ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, ఫిబ్రవరి 26 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ గిరిజన దర్బార్‌లో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలమడుగు మండలంలోని దుర్గాపూర్‌కు చెందిన నైతం రమణ తనకు బోరుబావి కావాలని, గుడిహత్నూర్ మండలం మన్పూర్‌కు చెందిన కనక లాలురాం ఇల్లు మంజూరు చేయాలని, ఆదిలాబాద్ మండలం అంకాపూర్‌కు చెందిన తుకారాం జనరల్ స్టోర్‌కు రుణం ఇవ్వాలని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు తమకు రుణాలు, పింఛన్లు, ఇండ్లు, స్వయం ఉపాధి పథకాలు కావాలని దరఖాస్తులు సమర్పించారు. ఈ ప్రజావాణిలో ఏపీవో కనక భీంరావు, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి బాలు, ఏవో రాంబాబు, ఏపీవో భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

జీతాల్లేవ..

- అవస్థలు పడుతున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు
- జిల్లాలోని వివిధ శాఖల్లో 1,800 మందికి పైగా ఉద్యోగులు
- ఒక్క వైద్యారోగ్య శాఖలోనే 650 మందికి రాని జీతాలు
- మూడు నెలలుగా ఆగిన టీబీ రోగులకు ఇచ్చే ఆర్థిక సాయం

రెండు నెలలుగా అందని వేతనాలు

నిర్మల్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన

నిర్మల్, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి జీతాలు రాకపోవడంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని మండిపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలతోపాటు ప్రతి నెల సమయానికి జీతాలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉండి ఉంటే సమయానికి జీతాలతోపాటు ఉద్యోగాలు రెగ్యూలర్ అయ్యేవని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,800 మందికి పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వైద్య శాఖలో ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, వైద్యులు ఇలా అన్ని విభాగాల్లో పని చేస్తున్న దాదాపు 650 మందికి మూడు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే గ్రామీణాభివృద్ధి శాఖలో 250 మందికి రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. విద్యా శాఖలో సుమా రు 500 మందికి రెండు నెలలుగా జీతాలు అందని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వమే నిధులు విడుదల చేయడం లేదని, అందుకే జీతాలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే కేసీఆర్ ప్రభుత్వం టీబీ రోగులకు ప్రతి నెలా రూ.500 చొప్పున సాయం అందించేది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి ఆర్థిక సాయం ఆగింది. దీంతో జిల్లాలోని దాదాపు 1,400 మంది ఇబ్బందులు పడుతున్నారు.

స్కూల్ ఫీజులు కట్టలేకపోతున్నాం..

మూడు నెలల నుంచి తమకు జీతాలు రావడం లేదు. దీంతో పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేకపోతున్నాం. నా ఒక్కడి జీతంపైనే ఐదుగురు కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారు. నెలనెలా జీతం రాకపోవడంతో కుటుంబం గడవడమే కష్టంగా మారింది. జీతాలు వస్తాయన్న నమ్మకంతో విధులకు హాజరవుతున్నాం. తొందరగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి.

- రజాక్, ఫార్మాసిస్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, నిర్మల్.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెగ్యులర్‌గా వచ్చేవి..

నేను నిర్మల్‌లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఎంనీహెచ్, న్యూట్రీషన్ కిట్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న. రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో అందరితో పాటే జీతాలు రెగ్యులర్‌గా వచ్చేవి. కేవలం జీతంపైనే ఆధారపడ్డ మా లాంటి చిన్న ఉద్యోగులకు నెలనెలా జీతాలు వేస్తే బాగుంటుంది.

- పీ.సతీశ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, నిర్మల్.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ మండలంలోని చాంద, పొచ్చెర గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్లు, మురికి కాల్వ పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రత్యేక నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నదని పేర్కొన్నారు. గ్రామస్తులకు ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా పనులు ప్రారంభమయ్యాయని అన్నారు.

కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

వైభవంగా మల్లన్న జాతర

ముథోల్, ఫిబ్రవరి 26 : ఎడ్‌బిడ్ గ్రామంలో సోమవారం మల్లన్న జాతర వైభవంగా కొనసాగింది. భక్తులు వేకువజాము నుంచే మల్లన్నకు పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10వేలు, 50 గ్రాముల వెండి కడియం, రెండో బహుమతిగా రూ.5వేల నగదు అందజేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోండా ఎస్ఐ సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పల్స్ పోలియోను సక్సెస్ చేయండి..

ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 3వ తేదీ(ఆదివారం) నుంచి మూడు రోజులపాటు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. ముఖ్యంగా స్లమ్ ఏరియాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. 3వ తేదీ ఆదివారం కావడంతో సెలవుదినం అనుకోవద్దని, అంగన్‌వాడీ టీచర్స్, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉండి పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. జిల్లాలో ఐదేండ్లలోపు చిన్నారులు 77,155 మంది ఉన్నారని పేర్కొన్నారు. అర్బన్ ఏరియాలో 81, రూరల్ ఏరియాలో 420, ట్రైబల్ ఏరియాలో 301 మొత్తం 802 కేంద్రాలను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, పట్టణ ముఖ్య కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళ సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమ నిర్వహణలో చురుగ్గా పాల్గొనాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాలు, సంచార జాతులు, ఇటుక బట్టీలు, నిర్మాణ స్థలాలలోని చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 4,5 తేదీల్లో కూడా ఇంటింటి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, అధికారులు పాల్గొన్నారు.

ఒకరికి జీవితఖైదు

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో గల అర్లి(టీ) గ్రామంలోని శాంతినగర్‌కు చెందిన కుమ్ర బావ్‌రావు తనకు భూమి కౌలుకు ఇవ్వలేదని ఆయనకు సమీప బంధువైన ఆత్రం అంకూశ్‌ను హత్య చేశాడు. ఈ కేసులో జిల్లా ప్రధాన సెషన్ జడ్జి వరప్రసాద్ నేరస్తుడికి జీవిత ఖైదుతోపాటు రూ.2 వేల జరిమానా విధించినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. జూలై 4, 2023 రోజు సాయంత్రం కుమ్ర బావ్‌రావు కత్తితో దాడి చేసి హత్య చేశాడని అంకూశ్ తండ్రి రాంకిషన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసును నిరూపించడానికి జిల్లా కోర్టు పీపీ సంజయ్ కుమార్ 16 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. సాక్షులు, సాక్ష్యాధారాల ఆధారంగా నేరస్తుడు శిక్షార్హుడని పీపీ వాదించారని, ఇరుపక్షాల వాదనలు విన్న జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి వరప్రసాద్ నేరస్తుడిపై హత్యా నేరం రుజువైనందున జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

అర్జీల పరిష్కారంపై సమీక్ష

అర్జీలు స్వీకరిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 26 : తెలంగాణ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అమలు చేస్తున్న ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుల్లో సీఎం పేషీలో పెట్టుకున్న అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సీఎం పేషీకి వచ్చిన అర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ, డీఆర్‌డీఏ, మున్సిపల్, ఎక్సైజ్, పోలీసు, ఎస్సీ కార్పొరేషన్, రెవెన్యూ శాఖలకు వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవాటి గురించి తెలుసుకున్నారు. పరిష్కారం చేసి ఆన్‌లైన్ రిపోర్టు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగయ్య, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి..

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : ప్రజావాణిలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గల సమావేశ మందిరంలో అర్జీలను స్వీకరించారు. 18 దరఖాస్తులు వచ్చాయని, వీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో పాల్గొన్నారు.